క్లుప్తంగా

అమర్‌నాథ్ పరామర్శ



అప్పలస్వామి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న అమర్‌నాథ్

తగరపువలస: ఆనందపురం మండలం చందక పంచాయతీ వెంకటాపురానికి చెందిన ఇల్లపు అప్పలస్వామికి వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ ఆదివారం నివాళులు అర్పించారు. ఇటీవల అప్పలస్వామి మరణించడంతో ఆయన కుమారుడు, పార్టీ మండల యూత్ అధ్యక్షుడు వెంకట్ జగన్‌ను పరామర్శించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బంక సత్యం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దత్తాత్రేయుని కల్యాణం



దత్రాత్రేయ స్వామి, అనఘాదేవిల కల్యాణవేడుకను వీక్షిస్తున్న భక్తులు

పద్మనాభం: మండలంలోని బుడ్డివలస అగ్రహారం పంచాయతీ లింగన్నపేటలో గాయత్రీ దేవి ఆలయ 12వ వార్షిక వేడుకల్లో భాగంగా రెండో రోజైన ఆదివారం దత్తాత్రేయ స్వామి, అనఘా దేవి ఉత్సవ విగ్రహాలకు కల్యాణం ఘనంగా నిర్వహించారు. ముందుగా పెళ్లి రాట వేశారు. అనంతరం కల్యాణం నిర్వహించారు. అర్చకుడు నేరేళ్ల విశ్వేశ్వర శర్మ ఆధ్వర్యంలో ఈ కల్యాణం జరిగింది. పరిసర ప్రాంతాల నుంచి తరలి వచ్చిన దంపతులు ఈ కల్యాణంలో పాల్గొని, కనులారా వీక్షించారు.

90 మంది రక్తదానం



రక్తదానం చేస్తున్న దాతలు

భీమునిపట్నం: అపోహలు వీడి, ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని భీమిలిలోని కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ చైర్మన్ కలిగొట్ల శ్రీరామ్ అన్నారు. ఆదివారం కలిగొట్ల శ్రీదేవి జయంతి సందర్భంగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో ఆయన పాల్గొన్నారు. శిబిరంలో 90మంది దాతలు రక్తదానం చేశారు. వైజాగ్ బ్లడ్ బ్యాంక్, విజయనగరానికి చెందిన విజయ బ్లడ్ బ్యాంకు ప్రతినిధులు రక్తం సేకరించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు కె. సూర్యనారాయణ మూర్తి, కె.భానోజీరావు, కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారుల రక్తదానం

తగరపువలస: ఆనందపురం మండలం పెద్దిపాలెంలో ఆదివారం క్రికెట్ క్రీడాకారులు రక్తదానం చేశారు. నిర్వాహకులు మాట్లాడుతూ పది రోజుల పాటు జరగనున్న క్రీడాపోటీలకు సంబంధించి ఎంట్రీ ఫీజు లేదని, జట్టు నుంచి ఐదు లేదా ఆరుగురు క్రీడాకారులు రక్తదానం చేయాలని అవగాహన కల్పించారు. ఈ మేరకు వారు రక్తదానం చేశారు. క్రికెట్ పోటీల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచే మూడు జట్లకు రూ.12వేలు, రూ.8వేలు, రూ.5వేలు నగదు బహుమతులు అందించనున్నట్లు చెప్పారు.

పార్టీ బలోపేతానికి మరింత కృషి



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరశురామరాజు

భీమునిపట్నం: నియోజకవర్గ స్థాయిలో బీజేపీ మరింత బలోపేతం కావడానికి అందరూ కృషి చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎం.పరశురామరాజు కోరారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో భీమిలిలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే నియోజకవర్గ స్థాయిలో పెద్ద ఎత్తున పార్టీ సభ్యత్వాలు నమోదు కావడం మంచి విషయమన్నారు. ఇదే స్ఫూర్తితో పార్టీ అభ్యున్నతికి కృషి చేయాలని కోరారు. నియోజకవర్గ పార్టీ కన్వీనర్ కంటుభుక్త రామానాయుడు మాట్లాడుతూ త్వరలో అన్ని ప్రాంతాల్లో బూత్ కమిటీలతో పాటు ఇతర కమిటీల ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ ముఖ్య నాయకులు ఉప్పాడ అప్పారావు, చక్రవర్తి, బండారు అనిల్‌కుమార్, ధోని నాగరాజు, సీరపు రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆదాయం @365 రోజులు



జీవామృతం కలుపుతున్న మహిళారైతు

సాధారణంగా రైతులకు సంవత్సరానికి రెండు సార్లు, లేదా మూడు సార్లు పంటల ద్వారా ఆదాయం వస్తూ ఉంటుంది. ఉద్యానవన రైతులకైనా ఏడాది పొడవునా ఆదాయం కష్టమే. కానీ ఈ రైతులు సాగులో నూతన ఒరవడి పాటిస్తూ 365 రోజులూ ఆదాయం వచ్చేలా చూసుకుంటున్నారు. అదీ అందరి ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ.. సేంద్రియ వ్యవసాయం చేస్తున్నారు. తక్కువ కమతాల్లో ఎక్కువ పంటలు వేస్తూ మంచి దిగుబడి సాధిస్తున్నారు. లాభాల బాటలో పయనిస్తున్నారు.

- ప్రకృతి వ్యవసాయంలో ఆదర్శం.. తర్లువాడ గ్రామం
- రసాయనాలు వాడకపోవడంతో ఆరోగ్యకర వాతావరణం
- ఏడాది పొడవునా ఆదాయం వచ్చేలా పంటల సాగు
- తక్కువ కమతంలో పదుల సంఖ్యలో వివిధ రకాల పంటలు



ఒకే క్షేత్రంలో దుంప, పండ్ల, తీగజాతి, ఆకుకూరలు, కూరగాయలు, బోర్డర్ క్రాప్ పంటలు



సేంద్రియ పద్ధతిలో వివిధ రకాల ఆకుకూరలు, కూరగాయల సాగు చేస్తున్న రైతు

తగరపువలస: ప్రకృతి వ్యవసాయం చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు ఈ ప్రాంత రైతులు. జిల్లాలో 797 మంది రైతులు 581 ఎకరాలలో ప్రకృతి వ్యవసాయం చేస్తుండగా.. అందులో 600 మందికి పైగా భీమిలి నియోజకవర్గంలోనే ఉండటం విశేషం. వీరిలో సేంద్రియ సాగు అత్యధికంగా చేసే రైతులు ఆనందపురం మండలం తర్లువాడ, భీమిలి మండలం మజ్జిపేటలో ఉన్నారు. సాధారణ సాగుతో పోలిస్తే సేంద్రియ సాగులో పంటను ఆహారంగా తీసుకుంటే అటు ఆరోగ్యం.. ఇటు రైతుకు ఆదాయం. పైగా వాతావరణం ఆహ్లాదంగా ఉంటుంది. జీడి, మామిడి, అరటి వంటి వాణిజ్య, తోట పంటలలో కూడా తీగె, ఆకుకూరలు సాగు చేసి అదనపు ఆదాయాన్నీ పొందుతున్నారు.

సాగు ఇలా..

➡ ఇక్కడి రైతులు ప్రకృతి వ్యవసాయ అసోసియేట్ల సూచనలు పాటిస్తున్నారు.

➡ గోమూత్రం, పేడ, శనగపిండి, పుట్టమన్ను, బెల్లం, పొగాకు, పచ్చి మిర్చి, చేపల వ్యర్థాలు, వేప, బొప్పాయి, ఉమ్మెత్త, జామ, కాకర, కానుగ, ముప్పిడి, జిల్లేడు ఆకులు ఉపయోగించిన జీవామృతం, ఘనామృతం, నీమాస్త్రం, మీనాస్త్రం, ఆగ్నేయాస్త్రం, బ్రహ్మాస్త్రం వంటివి తయారు చేసుకుని చేనుకు చీడ, తెగుళ్ల నివారణకు ఉపయోగిస్తున్నారు.

➡ దిగుబడితో పాటు పంటల రక్షణకు బంతి, మొక్కజొన్న వంటి వాటిని వేస్తున్నారు.

➡ సుడిదోమ, తామర తదితర పురుగుల ఉధృతిని అరికట్టేందుకు సాధారణ రైతుల వలె ఎల్లో, బ్లూ కార్డులు సాగులో వినియోగిస్తున్నారు.

ఏడాది పొడవునా ఆదాయం

సాధారణంగా సేంద్రియ సాగు చేసే రైతులు సొంత భూములు లేదా భాగానికి వ్యవసాయం చేసేందుకు చిన్న కమతాలను ఎంచుకుంటున్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం ఏడాది పొడవునా వచ్చేలా ప్రణాళికలు చేసుకుంటున్నారు. కేవలం 20 నుంచి 40 సెంట్ల విస్తీర్ణంలోనే పదుల సంఖ్యలో మడులు చేసుకుని పదుల సంఖ్యలో ఆకుకూరలు, కూరగాయలు, తీగె, పండ్లు, దుంప, సుగంధ, రక్షణ జాతులు సాగు చేస్తున్నారు. ఒక్కో రోజు ఒక్కో రకం పంటపై రూ.500 నుంచి రూ.2వేలు ఆదాయం సమకూరేలా చూసుకుంటున్నారు. సేంద్రియ సాగులో దిగుబడి అయిన పంటకు సాధారణ పంట కంటే అదనపు ఆదాయం లభిస్తుంది. ప్రత్యేకంగా అవని, బిగ్ బాస్కెట్ వంటి సంస్థలే వచ్చి సేంద్రియ దిగుబడులు కొని మార్కెట్ చేస్తున్నాయి. ఒకే రైతు గోంగూర, మెంతి, తోటకూర, పాలకూర, క్యారెట్, బీట్‌రూట్, ముల్లంగి, టమాటా, చిక్కుడు, వంగ, బెండ, చుక్కకూర, మిరప, జామ, కీర, ఉల్లి, వెల్లుల్లి, కర్ర పెండలం, బొప్పాయి, మొక్కజొన్న, ఆనప, బీర, క్యాబేజీ, దొండ, కాకర, పొట్ల, సజ్జలు పండిస్తున్నారు.



మడులలో సాగవుతున్న ఆకుకూరలు



అంతర పంటలుగా ముల్లంగి, క్యారెట్, మొక్కజొన్న, బెండ, గోంగూర, ఆనప తదితర 14 రకాలు

ప్రతి రోజూ ఆదాయం ఉంటుంది



గత నెలలో గోంగూర, మెంతి, పాలకూర, క్యారెట్, ముల్లంగి వంటి పంటల దిగుబడి వలన ప్రతి రోజూ రూ.200 నుంచి రూ.1500 ఆదాయం లభించింది. మడులలో పంటలు గట్లపై పెండలం, బొప్పాయి వంటివి సాగు చేస్తాం. జీడిలో అంతర పంటలుగా బీరు, ఆకుకూరలు వేస్తు ఖర్చులు పోను రూ.65వేలు మిగిలింది.

– రెల్లి పైడిరాజు, రైతు

40 సెంట్లలో సాగు



40 సెంట్ల భూమిలో సేంద్రియ అసోసియేట్ సూచించిన విధంగా ఘన జీవామృతం, వేపపిండి, ఆముదం పిండిలో విత్తన శుద్ధి చేసుకుంటే 45 రోజుల వరకు ఎలాంటి చీడపీడలు రావు. ఈలోగా దిగుబడి ప్రారంభమవుతుంది. సేంద్రియ పంటలకు మార్కెట్‌లో అదనపు ధర కూడా లభిస్తుంది.

– చందల వెంకన్న, రైతు

20 సెంట్లలో 20 రకాల పంటలు



నా 20 సెంట్ల భూమిలో దుక్కులు, గత్తం వంటి వాటికి రూ.20 వేల ఖర్చుతో 20 రకాల ఆకుకూరలు, కూరగాయలు వేశాను. విత్తనాలు మా సొంతం. మొదటి నెలలోనే ఆకుకూరలపై రూ.10వేల ఆదాయం లభించింది. ఖర్చులు పోను 6 నెలల్లో రూ.75 వేల ఆదాయం లభిస్తుంది.

– వంటాకుల రామారావు, రైతు

59 రకాల పోషకాలు అవసరం



మానవ శరీరానికి 18 రకాల పోషకాలు అవసరమైతే వ్యవసాయానికి 59 రకాలు అవసరం. ఫాస్పరస్, నత్రజని, పొటాషియం స్థూల పోషకాలు లభించే యూరియా, డీఏపీలనే రైతులు వినియోగిస్తారు. వాస్తవానికి జింక్, మెగ్నీషియం, కాల్షియం తదితర సూక్ష్మపోషకాలు అందిస్తే మొక్క పెరుగుదల, ఆరోగ్యం, తెగుళ్ల నివారణ సాధ్యపడుతుంది. అది సేంద్రియ వ్యవసాయంతోనే సాధ్యమవుతుంది.

– శ్రీనివాస చక్రవర్తి, సేంద్రియ వ్యవసాయ అసోసియేట్

గెడ్డ వాగులో వెలసిన షెడ్లు

- సాక్షిలో గతంలో ప్రచురితమైనా పట్టించుకోని అధికారులు
- శనివారం రాత్రి షెడ్లు నిర్మించిన ఆక్రమణదారులు


కూటమి నాయకుల చెరలో గెడ్డ వాగు

ఈ నెల 7న సాక్షిలో ప్రచురితమైన కథనం

తగరపువలస: పిల్లి కళ్లు మూసుకుంటే ఎలుక నాట్యమాడినట్టుంది ఆనందపురం మండలం గంభీరం పంచాయతీ కూటమి నాయకుల పద్ధతి. అధికారులు పట్టించుకోకపోవడంతో ఎక్కడికక్కడ అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయి. ఇక్కడ సర్వే నంబర్ 173లో విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఆనుకుని గెడ్డ వాగులో నిర్మాణాలను యథేచ్ఛగా ప్రారంభించారు. ఈ నెల 6వ తేదీ ఉదయం గెడ్డను ఆక్రమించి పునాదులు వేసిన సంగతి తెలిసిందే. దీనిపై 'కూటమి నాయకుల చెరలో గెడ్డవాగు' శీర్షికతో ఈ నెల 7న సాక్షిలో వార్త ప్రచురించిన సంగతి తెలిసిందే. ఈ విషయాన్ని రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా, తమకు సంబంధం లేదన్నట్టుగా వ్యవహరించారు. దీంతో శనివారం రాత్రే ఆక్రమణదారులు గోడలు కట్టి రెండు షెడ్లు నిర్మించి తలుపులు బిగించారు. మరోషెడ్డు నిర్మాణానికి మెటీరియల్ డంప్ చేశారు. 60 గజాల వంతున మూడు షెడ్లు కట్టి రూ.45 లక్షలకు విక్రయించడానికి కూటమి ప్రతినిధి ఒప్పందం చేసుకున్నట్టు పంచాయతీకి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. రెవెన్యూ అధికారులు ఈ గెడ్డ వాగులో షెడ్లు కూల్చకపోతే సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.



ఆదివారం ఉదయం ప్రత్యక్షమైన షెడ్లు

భావితరాలకూ చెదరని జ్ఞాపకం అప్పారావు

- ఆయన జ్ఞాపకార్థం గ్రంథాలయ నిర్మాణం అభినందనీయం
- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త చిన్న శ్రీను



గ్రంథాలయాన్ని సందర్శించిన వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్



తర్లువాడలో అప్పారావు విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మజ్జి శ్రీనివాసరావు, చిత్రంలో వెంకటరావు

తగరపువలస: ప్రముఖ వ్యాపారవేత్త, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు మజ్జి అప్పారావు జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు గ్రామంలో నిర్మించిన గ్రంథాలయం, ఆయన నిలువెత్తు విగ్రహం ద్వారా భావితరాలకు ఆయన గుర్తుండిపోతారని వైఎస్సార్‌సీపీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు అన్నారు. గ్రంథాలయ నిర్మాణం అభినందనీయమన్నారు. ఆనందపురం మండలం తర్లువాడలో మజ్జి అప్పారావు విగ్రహాన్ని, గ్రంథాలయాన్ని ఆయన ద్వితీయ వర్ధంతి సందర్భంగా ఆదివారం చిన్న శ్రీను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అప్పారావు దూరం కావడంతో రెండేళ్లుగా వారి కుటుంబ సభ్యులు పడుతున్న బాధ, ఆయన ఆశయాలు నెరవేర్చడం ద్వారా దూరం అవుతాయన్నారు. పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు మాట్లాడుతూ పాండవులలో ఐక్యత తమ అన్నదమ్ముల మధ్య ఉండేదన్నారు. ఆయన అకాల మరణం తమకు ఎప్పటికీ తీరని లోటన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో వందలాది మందికి చికిత్స చేసి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మజ్జి శారదా ప్రియాంక, జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు, జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, కార్పొరేటర్ దొలపల్లి ఏడుకొండలు, పద్మనాభం ఎంపీపీ కంటుబోతు రాంబాబు, పార్టీ అధ్యక్షుడు మండల బంక సత్యం, కోరాడ లక్ష్మణ, వైస్ ఎంపీపీలు పొంద్రంగి శ్రీను, బోని బంగారునాయుడు, బంటుపల్లి మణిశంకరనాయుడు, అక్కరమాని రామునాయుడు, గాదె రోసిరెడ్డి, వంకాయల మారుతీప్రసాద్ నగరాల కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిల్లా సుజాత, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు గండ్రెడ్డి శ్రీను, లెంక రాంబాబు, పల్ల రమణ, బలిరెడ్డి మహేష్, మరుపిళ్ల చిన్నయపాత్రుడు తదితరులు పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు కరణం ధర్మశ్రీ తర్లువాడ వచ్చి మజ్జి వెంకటరావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. అప్పారావుకు నివాళులు అర్పించారు. గ్రంథాలయాన్ని సందర్శించారు.



గ్రంథాలయంలో నాయకులతో మాట్లాడుతున్న అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకుడు ధర్మశ్రీ

'నూకరాజుకు ఆ స్థాయి లేదు'



మాట్లాడుతున్న కరుణాకరరెడ్డి

భీమునిపట్నం: మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డిని విమర్శించే స్థాయి టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజుకు లేదని రెండో వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి ఎస్.కరుణాకరరెడ్డి అన్నారు. భీమిలిలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్‌మోహన్ రెడ్డి 2.0తో వస్తానని ప్రకటించడంతో తెలుగుదేశం వారికి భయం పట్టుకుందన్నారు. అందుకే జగన్‌మోహన్‌రెడ్డిపై వ్యక్తిగత విమర్శలకు పాల్పడుతున్నారన్నారు. జగన్‌ను విమర్శించే స్థాయి, అర్హత కూడా లేదన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి జీరు వెంకటరెడ్డి, మూడో వార్డు పార్టీ అధ్యక్షుడు అల్లిపిల్లి నర్సింగరావు, మాజీ కౌన్సిలర్ కదిరి ఎల్లాజీ, నూకాలమ్మ ఆలయ ట్రస్ట్‌బోర్డు మాజీ చైర్మన్ వాసుపల్లి కొండబాబు, మూడో వార్డు పార్టీ ప్రధాన కార్యదర్శి పిన్నింటి ఎర్రయ్యరెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడు రామసూరప్పడు తదితరులు మాజీ సీఎం జగన్‌పై విమర్శలను ఖండించారు. కార్యక్రమంలో నాయకులు బోని సంజీవరావు, వాడమొదల జగ్గారావు, చిల్ల సూర్యనారాయణరెడ్డి, పీతల శంకరరావు పాల్గొన్నారు.

నేడు దుర్గాలమ్మ ఆలయ వార్షికోత్సవం



దుర్గాలమ్మ

తగరపువలస: చిట్టివలస బొగ్గురోడ్డు వద్ద దుర్గాలమ్మ ఆలయ మూడవ వార్షిక వేడుకలు సోమవారం జరగనున్నాయి. చిట్టివలస, చిల్లపేట, జీరుపేట, సంతపేట, కొత్తపేట, రెల్లివీధి, కొండపేట, ఆదర్శనగర్, సుఖీభవ కాలనీ, నమ్మివానిపేట గ్రామాల ప్రజలు ఉదయం 9 గంటల నుంచి అమ్మవారికి పసుపు, కుంకుమలు సమర్పించుకోవాలని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

ముగిసిన హిందీ పరీక్షలు



భీమిలి నెహ్రూ జీవీఎంసీ హైస్కూల్‌లో పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

తగరపువలస: దక్షిణ భారత హిందీ ప్రచార సభ, చెన్నై ఆధ్వర్యంలో జీవీఎంసీ భీమిలి నెహ్రూ హైస్కూల్‌లో శని, ఆదివారాలలో హిందీ పరీక్షలు జరిగాయి. ఈ రెండు రోజుల పాటు జరిగిన పరీక్షలలో లోయర్‌కు చెందిన పరిచయ్, ప్రాథమిక, మాధ్యమిక, రాష్ట్రభాష, ప్రవేశిక, హయ్యర్ పరీక్షలైన రాష్ట్ర భాష విశారద పూర్వార్థ, ఉత్తరార్థ, రాష్ట్రభాష ప్రవీణ పూర్వార్థ, ఉత్తరార్థలకు చెందిన 150 మంది విద్యార్థులు హాజరయ్యారు. ప్రధానోపాధ్యాయిని మాదాబత్తుల తిరుమల శ్రీదేవి ఆధ్వర్యంలో జరిగిన పరీక్షలకు ఉపాధ్యాయులు పి.శ్రీనివాస్, నాగభూషణం, సునీత ఇన్విజిలేటర్లుగా వ్యవహరించారు. ఈ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు భీమిలి ఆదర్శహిందీ ప్రేమీ మండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించిన సంగతి తెలిసిందే.

16వ రోజుకు రామాయణ ప్రవచనాలు

మధురవాడ: పెద్దల పట్ల సక్రమంగా ప్రవర్తించపోతే అనర్థాలు తప్పవని, దీనికి శ్రీరామాయణంలోని శూర్పణఖ వృత్తాంతమే నిదర్శనమని ప్రముఖ ప్రవచనకర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు తెలిపారు. మధురవాడ గాయత్రి విద్యాపరిషత్ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో జరుగుతున్న ప్రవచనాల్లో 16వ రోజు, ఆదివారం ఆయన రామాయణంలో అరణ్యకాండపై ప్రవచించారు. శ్రీరాముని పట్ల శూర్పణఖ మోహం, లక్ష్మణుడు ఆమె ముక్కు, చెవులు నరకడం తెలియజేశారు. ఈ వృత్తాంతం ఆధారంగా ప్రజల నడవడిక ఎలా ఉండాలి, దోషాలు ఎలా సరిదిద్దుకోవాలో వివరించారు. శ్రీరాముడు అగస్త్య మహర్షిని కలవడం, పంచవటిలో వారిని ఉండమని చెప్పడం తదితర అంశాలను తెలియజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు, అష్టలక్ష్మీ దేవాలయం ధర్మకర్త అన్నంరాజు సత్యనారాయణమూర్తి, గాయత్రి విద్యాపరిషత్ కార్యదర్శి ఆచార్య సోమరాజు, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

'పరీక్షా పే చర్చ'లో పాల్గొనాలి



డైట్ ప్రిన్సిపాల్ జ్యోతికుమారి

భీమునిపట్నం: పరీక్షలకు హాజరు కానున్న విద్యార్థుల్లో స్ఫూర్తి నింపేందుకు ఏటా ప్రధానమంత్రితో జరిగే 'పరీక్షా పే చర్చ' కార్యక్రమం సోమవారం జరగనుందని భీమిలిలోని జిల్లా విద్య శిక్షణ సంస్థ (డైట్) ప్రిన్సిపాల్ ఎం.జ్యోతికుమారి తెలిపారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీతో జరిగే ఈ ప్రత్యక్ష ప్రసార కార్యక్రమంలో ఉమ్మడి విశాఖ జిల్లాలో పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో విద్యార్థులు పాల్గొనాలని కోరారు. తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్ వరకు విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొనవచ్చని సూచించారు. ఆయా పాఠశాలలు, కళాశాలల్లో ప్రత్యక్ష ప్రసారాలకు అవసరమైన టీవీలు, ప్రొజెక్టర్లు ఉండే విధంగా చూసుకోవాలని, వీటి ద్వారా విద్యార్థులు, ఉపాధ్యాయులు తిలకించాలని తెలిపారు. కార్యక్రమం పూర్తయిన తరువాత పాల్గొన్న విద్యార్థుల సంఖ్య, ఇతర వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాల్స్‌కు సూచించారు. ఇందుకోసం అందరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



శిల్పారామంలో ఆదివారం సాయంత్రం ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన

పీఎం పాలెం: వారాంతపు వినోద కార్యక్రమాల ప్రదర్శనలో భాగంగా శిల్పారామం (జాతర)లో ఆదివారం సాయంత్రం 6 గంటలకు ఏర్పాటు చేసిన కూచిపూడి నృత్య ప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకుంది. నగరంలోని శ్రీ సిద్ధేంద్ర యోగి నాట్య కళామండలిలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు తమ నాట్య విన్యాసాలతో కార్యక్రమాన్ని రక్తి కట్టించారు. రంగని కల్యాణం నృత్య రూపకం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మోహన లక్ష్మి నృత్య దర్శకత్వం వహించారు. స్థానిక పరిపాలన అధికారి టి. విశ్వనాథ రెడ్డి పర్యవేక్షించారు.